ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
సోమవారం, 5 ఆగస్టు 2024 www.prajaaswaramdaily.com 2PM



# నాగార్జునసాగర్ గేట్లు ఓపెన్

నాగార్జునసాగర్, జూలై 16 (ప్రజాస్వరం): ఎగువ నుంచి భారీగా వరద చేరుకుంటున్న నేపథ్యంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తారు. కృష్ణమ్మకు ఎస్ ఈ నాగేశ్వరరావు, సీఈ అనిల్ కుమార్ జలహారతి ఇచ్చి నీటిని దిగువకు విడుదల చేశారు. తొలుత దిగువ ప్రాంతాల ప్రజల అప్రమత్తత కోసం మూడుసార్లు సైరన్ మోగించారు. అనంతరం ఒక్కొక్కటిగా ఆరు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. సాగర్ క్రస్టు గేట్ల ద్వారా దాదాపు 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదలనున్నట్లు అధికారులు తెలిపారు.



## తెలంగాణకు రండి..

# పెట్టుబడులు పెట్టండి

## రాష్ట్రాభివృద్ధికి ఉచితాలు మంచివి కావు

- ఉచితాల కోసం ప్రజలు ఎదురుచూసే పరిస్థితి రావొద్దు
- గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది
- రాష్ట్ర అభివృద్ధికి ఎన్ఆర్ఐల సహకారం అవసరం
- అన్నివిధాలుగా సహకరిస్తాం
- ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ సమావేశంలో సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 5 (ప్రజాస్వరం) : ప్రజలకు ఉచిత పథకాలు ఎల్లవేలలా మంచివి కావని.. కానీ, ప్రస్తుతం ఇంకా కొంతమంది ప్రజలకు వాటి అవసరం ఉందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా న్యూజెర్సీలో నిర్వహించిన ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ (యూఎస్ఏ) సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఎన్ ఆర్ ఐల సహకారం చాలా అవసరమని పేర్కొన్నారు. జన్మభూమిలో పెట్టిన ప్రతి పెట్టుబడికి తప్పకుండా ప్రయోజనం ఉంటుందని, దానికి తనదే భరోసా అని అన్నారు. మిగులు బడ్జెట్ తో ఉన్న రాష్ట్రాన్ని గత ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చిందని మండిపడ్డారు. 'రాష్ట్రం ఆర్థికంగా, దృఢంగా అభివృద్ధి చెందాలంటే ఉచితాలు మంచివి కావు. కానీ.. ప్రస్తుతం కొందరు పేదలు, అర్హులకు అవసరం. ప్రతి ఒక్కరికీ ఉద్యోగ అవకాశం కల్పించాలి. చేతి వృత్తులను ప్రోత్సహించాలి. ప్రభుత్వం ఇచ్చే ఉచితాల కోసం ప్రజలు ఎదురుచూసే పరిస్థితి రాకూడదు. ప్రతి తెలంగాణ బిడ్డకు మెరుగైన విద్య, వైద్యం అవసరం. రాష్ట్రానికి ఆదాయ మార్గాలు సమకూరినప్పుడే ఏదైనా సాధ్యం. అందుకే పెట్టుబడిదారులను తెలంగాణకు ఆహ్వానిస్తున్నాం. ప్రభుత్వం తరపున అవసరమైన సహాయ సహకారాలను అందిస్తాం' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.



# 7కు వాయిదా

న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ప్రజాస్వరం): ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ కేసు మరోసారి వాయిదా పడింది. ఇప్పటికే బెయిల్ పిటిషన్‌ను పలుమార్లు పక్కనెట్టిన రౌస్ అవెన్యూ కోర్టు.. సోమవారం నాడు డీఫాల్ట్ బెయిల్ పిటిషన్ విచారణను ఆగస్టు 7 వాయిదా వేసింది. సీనియర్ అడ్వకేట్ అందుబాటులో లేకపోవడంతో కేసును మరో రోజుకు వాయిదా వేయాలని కవిత తరపు లాయర్ కోర్టును కోరారు. ఈ క్రమంలో తదుపరి విచారణను వాయిదా వేశారు. ఎల్లుండి తుది వాదనలు వింటానని ట్రయల్ కోర్టు స్పష్టం చేసింది. మరోవైపు తీహార్ జైలులో ఐదు నెలల నుంచి ఉన్న ఎమ్మెల్సీ కవితను రేపు కేటీఆర్, హరీష్ రావు, జగదీష్ రెడ్డిలు కలవనున్నారు. ఈమేరకు వారు ఢిల్లీకి చేరుకున్నారు.

## బడి పిల్లలకు
# గొడ్డుకారమా?



నిజామాబాద్, ఆగస్టు 5 (ప్రజాస్వరం) : బడీడు పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు విద్యాబుద్ధులు నేర్పేందుకు ఎంతో గొప్ప ఆలోచనతో తీసుకువచ్చిందే మధ్యాహ్న భోజన పథకం. కాంగ్రెస్ పాలనలో విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సైతం సక్రమంగా అందని పరిస్థితి నెలకొన్నది. పౌష్టికాహారంతో విద్యార్థుల కడుపులు నింపాల్సింది పోయింది.. కారం నూనె మెతుకులు తినాల్సిన పరిస్థితి ఎదురవుతున్నది. ఈ ఘటనలో నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



# హైదరాబాద్‌లో మరో దారుణం

### ఇంట్లో బంధించి మహిళపై తోటి ఉద్యోగి అత్యాచారం



హైదరాబాద్, ఆగస్టు 5 (ప్రజాస్వరం): రాష్ట్ర రాజధానిలో మరో దారుణం చోటు చేసుకుంది. మహిళను రూమ్ లో బంధించి తోటి ఉద్యోగి అత్యాచారానికి పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. హైదరాబాద్ బేగంపేటకు చెందిన సంతోష్ చైతన్య అనే వ్యక్తి తోటి మహిళా ఉద్యోగిని బంధించి రేప్ చేశాడు. ఏపీ అనంతపురం జిల్లాకు చెందిన ఓ మహిళ ఉద్యోగరిత్యా నగరానికి వచ్చింది. అయితే సదరు మహిళకు ఉండటానికి రూమ్ లేక పోవడంతో ఇల్లు వెతకడంలో సాయం చేస్తానని సంతోష్ చైతన్య నమ్మించాడు. అంత వరకు తన ఇంట్లో ఉండాలని తెలిపాడు. అయితే తనతోనే ఇంట్లో చెల్లెలుతో పాటు తల్లి ఉంటారని నమ్మబలికాడు. అది నమ్మిన మహిళ ఇంటికి వెళ్లే సరికి ఎవరూ లేకపోవడాన్ని గమనించింది. ఇదే విషయమై సంతోష్ చైతన్యను ప్రశ్నించగా మహిళను బంధించి అత్యాచారానికి పాల్పడ్డాడు. మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. కొన్ని రోజుల తర్వాత మహిళను బయటకు వదిలిపెట్టాడు. అనంతరం మహిళ ఎన్ని సార్లు కాల్ చేసినా సంతోష్ ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. మోసపోయినట్లు గ్రహించిన మహిళ పోలీసులను ఆశ్రయించి సదరు వ్యక్తిపై ఫిర్యాదు చేసింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




## బడి పిల్లలకు
# తప్పిన ప్రమాదం

### అదుపుతప్పి చెట్లపొదల్లోకి దూసుకెళ్లిన స్కూల్ బస్
### మద్యం మత్తులో బస్సు నడిపిన డ్రైవర్

మహబూబాబాద్, ఆగస్టు 5 (ప్రజాస్వరం): ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు అదుపుతప్పి కల్వర్టు సమీపంలో చెట్ల పొదల్లోకి దూసుకెళ్లగా చిన్నారులకు తృటిలో ప్రమాదం తప్పింది. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం లో చోటు చేసుకుంది. మండల కేంద్రంలో ఉన్న ఆర్యభట్ట హై స్కూల్‌లో చదువుతున్న పిల్లలను తీసుకురావడానికి స్కూల్ బస్సు సోమవారం తొర్రూరు నుండి చికటాయపాలెం గ్రామానికి ఉదయం 7 గంటలకు బయలుదేరింది. 7.30 చికటయపాలెం గ్రామం నుండి బయలుదేరి చెర్లపాలెం గ్రామానికి వెళ్తుండగా గ్రామ శివారులో డ్రైవర్ సురేష్ మద్యం మత్తులో బస్సును నడుపగా బస్సు అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లి చెట్టును ఢీకొంది. దీంతో బస్సుకు రైట్ సైడ్ అద్దం పగిలిపోయింది. బస్సులో సుమారు 20 నుంచి 30 మంది విద్యార్థులు ఉన్నారు. బస్సు చెట్టును ఢీకొనడంతో పిల్లలు ఒక్కసారిగా అరుపులు చేస్తూ తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రమాదంలో చిన్నారులు చిన్న గాయాలతో బయటపడడంతో ఊపిరి పీల్చుకున్నారు. పిల్లల అరుపులు విని అక్కడ ఉన్న స్థానికులు బస్సు వద్దకు చేరుకుని విద్యార్థులను క్షేమంగా బయటకు తీసుకువచ్చారు. తొర్రూరు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

# ఉప ఎన్నికలు తప్పవు

### పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయిస్తాం
### త్వరలోనే సుప్రీం కోర్టులో కేసు వేస్తాం : కేటీఆర్



న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ప్రజాస్వరం): తెలంగాణలో ఉపఎన్నికలు తప్పవని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయిస్తామని హెచ్చరించారు. దిల్లీ పర్యటనలో ఉన్న కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు.. న్యాయకోవిదులతో చర్చలు జరిపారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపులపై దిల్లీలో భారాస న్యాయపోరాటం చేస్తుందన్నారు. రాజ్యాంగ నిపుణులతో పార్టీ సీనియర్ ప్రతినిధుల బృందం సమావేశమవుతుందని, భారాస తరపున త్వరలోనే సుప్రీం కోర్టులో కేసు వేస్తామని తెలిపారు. ఇప్పటికే పార్టీ ఫిరాయింపుల విషయంలో సుప్రీంకోర్టు పలు తీర్పులు ఇచ్చిందని రాజ్యాంగ నిపుణులు తెలిపారన్నారు. గతంలో మాదిరిగా అనర్హత వేటు విషయంలో సుదీర్ఘ కాలం పాటు నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ ఈ అంశాన్ని నాన్చలేరని స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రస్తుతం సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నందున హైకోర్టు సైతం ఎక్కువ కాలం వాయిదా వేసే అవకాశం లేదని న్యాయ నిపుణులు తెలిపారన్నారు. హైకోర్టు నిర్ణయం త్వరగా ప్రకటించకుంటే సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉందన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజాక్షేత్రంలోనే బుద్ధి చెప్తామన్నారు.

### దళిత మహిళపై ఇంత దాష్టీకమా?

షాద్‌నగర్‌లో దళిత మహిళపై పోలీసుల దాడిని కేటీఆర్ ఖండించారు. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత మహిళపై ఇంత దాష్టీకమా? అని మండిపడ్డారు. 'ఇదేనా ఇందిరమ్మ పాలన? ఇదేనా ప్రజాపాలన? దొంగతనం ఒప్పుకోవాలంటూ థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా?' అని ప్రశ్నించారు. రక్షించాల్సిన పోలీసుల దగ్గరే రక్షణలేని పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. దాడికి పాల్పడిన పోలీసులపై వెంటనే ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసు నమోదు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత మహిళకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.